సాక్షి సూర్యాపేట

సోమవారం। 23। అక్టోబర్। 2023



సాగర్‌లో పర్యాటకుల సందడి

విద్యాసంస్థలకు దసరా సెలవులు ఇవ్వడంతో నాగార్జునసాగర్‌లో ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది.

- IIలో



యాదాద్రిలో తగ్గిన భక్తుల రద్దీ

దసరా పండుగ నేపథ్యంలో ప్రజలు తమ సొంతూళ్లకు వెళ్లడంతో ఆదివారం యాదాద్రిలో భక్తుల రద్దీ తగ్గింది.

- IIలో



ఎన్నికల వేళ విస్తృత తనిఖీలు

ఎన్నికల నేపథ్యంలో ఆదివారం జిల్లాలో పోలీసులు విస్తృత తనిఖీల్లో 13.70లక్షల నగదు పట్టుబడింది.

- IIలో

న్యూస్‌రీల్

విజయానికి సంకేతం 'దసరా'

- విజయదశమి శుభాకాంక్షలు తెలిపిన మంత్రి జగదీష్‌రెడ్డి



సూర్యాపేట: చెడుపై మంచి సాధించిన విజయానికి సంకేతం దసరా అని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి పేర్కొన్నారు. జిల్లా ప్రజలకు ఆయన విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. దసరా రోజున శుభసూచికంగా పాలపిట్టను దర్శించి, పవిత్రమైన జమ్మిచెట్టుకు పూజలు చేసే సంప్రదాయం గొప్పదని పేర్కొన్నారు. జమ్మి ఆకును బంగారంలా భావించి పంచుకుంటూ, పెద్దల ఆశీర్వాదాలు తీసుకుని, ప్రేమాభిమానాలను చాటుకోవడం దసరా పండుగ ప్రత్యేకత అని మంత్రి తెలిపారు. విజయానికి సంకేతమైన దసరా నాడు తలపెట్టిన కార్యాలన్నీ ఫలించాలని, ఆయురారోగ్యాలు, సిరిసంపదలతో జీవించేలా ప్రజలను దీవించాలని కనకదుర్గమ్మ అమ్మవారిని మంత్రి ప్రార్థించారు.

కలెక్టర్ దసరా శుభాకాంక్షలు



దురాజ్‌పల్లి (సూర్యాపేట): సూర్యాపేట జిల్లా ప్రజలకు కలెక్టర్ వెంకట్రావ్ దసరా శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలంతా కుటుంబ సమేతంగా విజయదశమి వేడుకలను ఘనంగా నిర్వహించుకోవాలని కోరారు.


బేడ బుడిగ జంగాలకు ప్రాధాన్యమివ్వాలి



అభివాదం చేస్తున్న బేడబుడిగ జంగాలు

భానుపురి (సూర్యాపేట): స్వాతంత్య్రం వచ్చి 70 సంవత్సరాలు దాటినా బేడ బుడిగ జంగాలు అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారని బేడ బుడిగ జంగాల జేఏసీ జిల్లా అధ్యక్షుడు బాణాల వెంకన్న అన్నారు. ఆదివారం సూర్యాపేటలోని గాంధీ పార్కులో ఏర్పాటుచేసిన జేఏసీ సమావేశంలో ఆయన మాట్లాడారు. బేడ బుడిగ జంగాలకు సంక్షేమ పథకాల్లో తగిన ప్రాధాన్యత ఇవ్వాలని, రాజకీయంగా ఎమ్మెల్సీ, ఎంపీ, ఎమ్మెల్యే టికెట్లు కేటాయించాలన్నారు. యువజన సంఘం నాయకుడు నిడుగొండ రామచందర్ మాట్లాడుతూ విద్య, రాజకీయంగా వెనుకబడిన బేడ బుడిగ జంగాలకు రాబోయే ఎన్నికల అనంతరం కార్పొరేషన్ చైర్మన్ పదవిని కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాణాల రాంబాబు, నాయకులు సిరుపాటి లచ్చిరాం, వెంకటరత్నం, వానరాశి వెంకన్న, రేవెల్లి లింగయ్య, రేవల్లి సైదులు, కడమంచి సంజీవ, ప్రభాకర్, పురణపు లింగయ్య, పర్వతం నాగార్జున, హస్తం దుర్గప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

యాదాద్రిలో సంప్రదాయ పూజలు



కల్యాణం నిర్వహిస్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రంలో ఆదివారం సంప్రదాయ పూజలు కొనసాగాయి. వేకువజామున ఆలయాన్ని తెరిచిన ఆచార్యులు సుప్రభాత సేవ నిర్వహించారు. అనంతరం ఆరాధన, నిజాభిషేకం, అర్చన తదితర పూజలు గావించారు. ఇక ప్రథమ ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, ముఖ మండపంలో అష్టోత్తర పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయంలో జోడు సేవలను ఊరేగించారు. రాత్రి శ్రీస్వామి, అమ్మవార్లకు శయనోత్సవం నిర్వహించి ఆలయాన్ని ద్వార బంధనం చేశారు.

24న యాదాద్రికి బిహార్ ఆడిటర్ల బృందం

భువనగిరి టౌన్: బిహార్ రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖకు చెందిన 150 మంది ఆడిటర్ల బృందం ఈనెల 24న యాదాద్రికి రానుంది.ఈ మేరకు అదనపు కలెక్టర్ రెవెన్యూ భాస్కర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆడిటర్ల బృందం శిక్షణలో భాగంగా తెలంగాణ రాష్ట్రంలో వివిధ ప్రాంతాలను సందర్శించనుందన్నారు. 24వ తేదీ 7.30 గంటలకు యాదాద్రీశుడిని దర్శించుకుంటారని పేర్కొన్నారు.

- రామ రామ రామ ఉయ్యాలో..



సూర్యాపేటలోని సద్దుల చెరువు సమీపంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు (ఇన్‌సెట్‌లో) బతుకమ్మను చెరువులో నిమజ్జనం చేస్తున్న మంత్రి జగదీష్‌రెడ్డి

- దుర్గాదేవిగా అమ్మవారు



దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నేరేడుచర్లలోని విజయదుర్గ ఆలయంలో శ్రీదుర్గాదేవి అలంకరణలో అమ్మవారు

నాలుగే ఖరారు

ఉమ్మడి జిల్లాలో నాలుగు అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన బీజేపీ

- 8 నియోజకవర్గాల్లో ఇంకా తేల్చని కమలం పార్టీ
- ఆశావహులకు తప్పని ఎదురుచూపు
- మొదటి జాబితాలో రాజగోపాల్‌రెడ్డికి దక్కని చోటు



వెంకటేశ్వర్‌రావు

నారాయణ రెడ్డి

నివేదితరెడ్డి

రామచంద్రయ్య

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : భారతీయ జనతా పార్టీ నాలుగు స్థానాల్లోనే అభ్యర్థులను ఖరారు చేసింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 12 నియోజకవర్గాలకు గాను ఆదివారం నాలుగు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. కొన్ని రోజులుగా జాబితా ఇదిగో.. అదిగో.. అంటూ ఉత్కంఠ రేపుతూ వచ్చిన అధిష్ఠానం ఆలస్యంగానైనా అన్ని స్థానాలకు అభ్యర్థులను ప్రకటిస్తుందని ఆశావహులు భావించారు. అందుకు భిన్నంగా నాలుగు స్థానాల్లో మాత్రమే అభ్యర్థులను ప్రకటించడంతో మిగతా చోట్ల ఆశావహులకు నిరీక్షణ తప్పడం లేదు. రాష్ట్ర వ్యాప్తంగా 52 మంది అభ్యర్థులతో కూడిన జాబితాను బీజేపీ ఆదివారం ప్రకటించింది. అందులో ఉమ్మడి జిల్లాలోని 12 స్థానాలకుగాను నాగార్జునసాగర్ నుంచి కంకణాల నివేదిత రెడ్డి, సూర్యాపేట నుంచి సంకినేని వెంకటేశ్వరరావు, భువనగిరి నుంచి గూడూరు నారాయణరెడ్డి, తుంగతుర్తి నుంచి కడియం రామచంద్రయ్య పేర్లను ఖరారు చేసింది.

ఆయనే పోటీచేస్తారా.. ?

మునుగోడులో కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి గతేడాది ఎమ్మెల్యే పదవి రాజీనామా చేసి, బీజేపీలో చేరడంతో గతేడాది ఉప ఎన్నికలు వచ్చాయి. ఆ ఎన్నికల్లో హోరాహోరిగా పోటీ జరిగింది. రాజగోపాల్‌రెడ్డి ఓడిపోయారు. ఇప్పుడు సాధారణ ఎన్నికల్లో పోటీలో ఉండేందుకు రాజగోపాల్‌రెడ్డి టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. అయినా, బీజేపీ ప్రకటించిన మొదటి జాబితాలో కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి చోటు కల్పించలేదు. దీంతో ఆయనే అక్కడి నుంచి పోటీచేస్తారా? ఆయన సతీమణిని పోటీలో దింపుతారా? అన్న చర్చ మొదలైంది. ఇదివరకు ఈ చర్చ ఉన్నప్పటికీ రాజగోపాల్‌రెడ్డినే పోటీలో ఉంటారని పార్టీ వర్గాలు చెబుతూ వచ్చాయి. ఇప్పుడు ఆయన పేరును మొదటి జాబితాలో లేకపోవడం చర్చనీయాంశంగా మారింది. కాగా, బీజేపీ రెండో జాబితాను ఎప్పుడు ప్రకటిస్తుందనే చర్చ జరుగుతోంది. ఆ జాబితా ఎప్పుడు వస్తుంది.. ఆ అభ్యర్థుల ప్రచారానికి ఎంత సమయం ఉంటుందనే విషయాలను అధిష్ఠానం ఆలోచించడం లేదని ఆ పార్టీ వర్గాలే వ్యాఖ్యానించాయి.

- **నివేదితకు మరోసారి అవకాశం**

సాగర్ నియోజకవర్గంలో బీజేపీ నుంచి కంకణాల నివేదితరెడ్డి 2018 ఎన్నికల్లో పోటీచేశారు. ఇప్పుడు మరోసారి పోటీలో ఉండబోతున్నారు. బీజేపీ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి సతీమణి కావడంతో ఆమెకు రెండోసారి టికెట్ దక్కింది.

- **తొలిసారి పోటీలో..**

భువనగిరి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి గూడురు నారాయణరెడ్డి మొదటిసారి పోటీచేస్తున్నారు. కాంగ్రెస్‌లో విద్యార్థి, యువజన సంఘాల నాయకునిగా కొనసాగుతూ 2005 నుంచి 2020 వరకు ఏఐసీసీ సభ్యుని ఉన్నారు. పీసీసీ కోశాధికారిగా పనిచేశారు. 2020లో బీజేపీలో చేరిన ఆయన ఇప్పుడు మొదటిసారిగా బీజేపీ నుంచి పోటీచేస్తున్నారు.

- **మళ్లీ తుంగతుర్తి నుంచే..**

తుంగతుర్తి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కడియం రామచంద్రయ్య బీజేపీ అభ్యర్థిగా రెండోసారి పోటీలో ఉంటున్నారు. 2018లో బీజేపీలో చేరిన ఆయన ఆ ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేశారు. ఇప్పుడు కూడా అక్కడి నుంచే రెండోసారి పోటీ చేస్తున్నారు.

ఇంకా ఉత్కంఠ..

బీఆర్‌ఎస్ పార్టీ అన్ని పార్టీల కంటే ముందుగానే అభ్యర్థులను ఆగస్టు 21వ తేదీనాడే ప్రకటించి ప్రచారంలో దూకుడు పెంచింది. కాంగ్రెస్ పార్టీ కూడా ఆరు స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించి ప్రచారంలో ముందుకు సాగుతోంది. బీజేపీ మాత్రం మొదటి జాబితాను ప్రకటించడంలో ఆలస్యం కావడంతో ఆశావహుల్లో ఉత్కంఠ నెలకొంది. జాబితాను ఎప్పుడు ప్రకటిస్తుందోనని ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. ఎట్టకేలకు ఆదివారం ప్రకటించినా ఉమ్మడి జిల్లాలో నాలుగు పేర్లనే ప్రకటించడంతో మిగతా ఎనిమిది నియోజకవర్గాల్లోని అభ్యర్థుల్లో ఇంకా ఉత్కంఠ కొనసాగుతూనే ఉంది.

ఐదోసారి పోటీలో సంకినేని

అసెంబ్లీ ఎన్నికల్లో సంకినేని వెంకటేశ్వర్‌రావు ఇప్పుడు ఐదోసారి పోటీ చేయబోతున్నారు. ఒకసారి తుంగతుర్తి నుంచి గెలుపొందిన ఆయన ఒకసారి ఆ నియోజవర్గం నుంచి ఓడిపోయారు. ఆ తరువాత సూర్యాపేటలో రెండుసార్లు ఓడిపోయారు. 1999లో తుంగతుర్తి నుంచి టీడీపీ తరపున పోటీచేసి గెలుపొందారు. 2004లో ఓడిపోయారు. 2009లో తుంగతుర్తి ఎస్సీ రిజర్వుడ్‌గా మారడంతో సూర్యాపేటకు వచ్చారు. అప్పుడు పోటీచేయాలని భావించినా మహాకూటమి పొత్తులో ఆ స్థానాన్ని టీఆర్‌ఎస్‌కు కేటాయించారు. 2014లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీలో ఉన్న ఆయన స్వల్ప తేడాతో ఓడిపోయారు. 2018లో బీజేపీ నుంచి పోటీచేసి ఓడిపోయారు. ప్రస్తుతం బీజేపీ నుంచి మళ్లీ పోటీలో ఉండబోతున్నారు.

బీఆర్‌ఎస్ అసమ్మతి నేతల్లో చీలిక

- కారులోనే తమ ప్రయాణమంటున్న శశిధర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ శిరీష
- కాంగ్రెస్‌లో చేరిన మిగతా అసమ్మతి నేతలు



మంత్రి కేటీఆర్ సమక్షంలో చేతులు కలుపుతున్న శశిధర్‌రెడ్డి- మల్లయ్యయాదవ్

కోదాడ: కోదాడ నియోజకవర్గానికి చెందిన బీఆర్‌ఎస్ అసమ్మతి నేతల్లో చీలిక వచ్చింది. నిన్నటి వరకు ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్‌పై కారాలు, మిరియాలు నూరిన అసమ్మతి నేతలు కన్మంతరెడ్డి శశిధర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ వనపర్తి శిరీషలక్ష్మీనారాయణలు మల్లయ్య యాదవ్‌తో చేతులు కలిపారు. ఆదివారం హైదరాబాద్‌లోని ప్రగతిభవన్‌లో నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు తక్కెలపల్లి రవీంద్రరావు సమక్షంలో మంత్రి కేటీఆర్ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్, శశిధర్‌రెడ్డి, వనపర్తి శిరిషలక్ష్మీనారాయణల మధ్య రాజీ కుదిర్చారు.

చివరి నిమిషంలో ప్రగతిభవన్ నుంచి పిలుపు

కొద్ది రోజులుగా శశిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ అసమ్మతి నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరాలని నిర్ణయించుకున్నారు. ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి శశిధర్‌రెడ్డి ఇంటికి వెళ్లి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. తాను బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసి త్వరలో కాంగ్రెస్ పార్టీలో చేరతానని శశిధర్‌రెడ్డి ఉత్తమ్‌తో స్వయంగా తెలిపారు. ఈమేరకు శనివారం కోదాడలో విలేకరుల సమావేశం నిర్వహించి, బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసి ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరాలని నిర్ణయించుకున్నారు. ఈక్రమంలో శనివారం తెల్లవారుజామున శశిధర్‌రెడ్డికి మంత్రి కేటీఆర్ ఫోన్ చేసి హైదరాబాద్ రావాలని, అవసరమైతే బీఫామ్ కూడా ఇస్తామని చెప్పడంతో ఆయన హుటాహుటిన ప్రగతి భవన్‌కు వెళ్లారు. మరోపక్క కోదాడ మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు నివాసంలో అసమ్మతి నేతలు సమావేశాన్ని మొదటగా 10 గంటలకు నిర్ణయించగా.. దానిని 12 గంటలకు మార్చారు. అప్పటికీ శశిధర్‌రెడ్డి విషయంలో స్పష్టత రాకపోవడంతో చందర్‌రావుతో సహా మిగతా నేతలు తాము బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. శశిధర్‌రెడ్డితో పాటు ప్రగతిభవన్‌కు వెళ్లిన చిలుకూరు ఎంపీపీ, జెడ్పీటీసీలు కూడా తాము బొల్లం మల్లయ్యతో కలిసి పని చేయలేమని ప్రకటించారు. ఇందులో భాగంగా శశిధర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ తప్ప మిగతా అందరూ ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు.

బొల్లం మల్లయ్య విజయానికి కృషి చేస్తాం

– శశిధర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్

బొల్లం మల్లయ్యయాదవ్‌తో ఉన్న బేధాభిప్రాయాలను పక్కన పెట్టి ఆయన విజయానికి తాము కృషి చేస్తామని బీఆర్‌ఎస్ నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జ్ కన్మంతరెడ్డి శశిధర్‌రెడ్డి, కోదాడ మున్సిపల్ చైర్‌పర్సన్ వనపర్తి శిరీష తెలిపారు. ఆదివారం ఢిల్లీలో కేటీఆర్ సమక్షంలో రాజీ కుదిరిందని పేర్కొన్నారు.

అవినీతి పాలనకు తెరలేపిన ఎమ్మెల్యే

- ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



కాంగ్రెస్‌లో చేరిన మాజీ ఎమ్మెల్యే చందర్‌రావుతో ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

కోదాడ: ప్రశాంతంగా ఉన్న కోదాడలో ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అవినీతి, అరాచక పాలనకు తెరలేపారని, ఆయనను మరోసారి గెలిపిస్తే కోదాడను నిలువునా అమ్మేస్తాడని ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. ఆదివారం రాత్రి కోదాడలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో బీఆర్‌ఎస్‌కు చెందిన పలువురు నేతలు మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్ రియల్ ఎస్టేట్ వ్యాపారుల నుంచి డబ్బులు వసూళ్లు చేశాడని విమర్శించారు. చివరకు పోలీస్ అధికారుల బదిలీల్లో కూడా రూ.లక్షలు వసూలు చేశాడన్నారు. మట్టి వ్యాపారులు లంచం ఇవ్వకపోతే మట్టి తోలకాన్ని ఆపివేశాడన్నారు. ఇలాంటి వారిని ఇంటికి పంపడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. బీఆర్‌ఎస్ అసమ్మతి నేతలు కాంగ్రెస్‌లో చేరుతున్నందున ఆ పార్టీ నాయకులు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి నలమాద పద్మావతితో పాటు ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చందర్‌రావు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్లు పాల్గొన్నారు. కాగా.. కాంగ్రెస్‌లో చేరిన వారిలో మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు ఏర్నేని బాబు, మహబూబ్‌జానీ, బుర్రా సుధారాణి, మునగాల ఎంపీపీ ఎలక బిందు, చిలుకూరు ఎంపీపీ బండ్ల ప్రశాంతి, మోతె ఎంపీపీ ఆశా శ్రీకాంతరెడ్డి, అనంతగిరి ఎంపీపీ చుండూరు వెంకటేశ్వర్లు, జెడ్పీటీసీలు, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులున్నారు.

షాడో ఎమ్మెల్యే అరాచకాలతోనే పార్టీని వీడుతున్నాం



రాజీనామా పత్రాలు చూపుతున్న మార్కెట్ మాజీ చైర్‌పర్సన్, సర్పంచ్‌లు

కోదాడ: కోదాడ షాడో ఎమ్మెల్యేగా వ్యవహరిస్తున్న కోదాడ ఎంపీపీ, ఆమెను ప్రోత్సహిస్తున్న ఎమ్మెల్యే అరాచకాలను తట్టుకోలేక విధిలేని పరిస్థితుల్లో బీఆర్‌ఎస్‌ను వీడుతున్నామని కోదాడ మాజీ మార్కెట్ చైర్‌పర్సన్ బుర్రా సుధారాణి, పలువురు సర్పంచ్‌లు ప్రకటించారు. ఆదివారం కోదాడలో ఆమె నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. కోదాడలో మట్టి వ్యాపారుల నుంచి నెలకు రూ.8లక్షల నుంచి రూ.10 లక్షలు వసూలు చేస్తున్న షాడో ఎమ్మెల్యేతో పట్టణంలో వందల మంది ఇళ్లను కట్టుకోలేక నెలల తరబడి ఇబ్బందులు పడ్డారన్నారు. వీరి అక్రమాలతో ప్రజలు తమను నిలదీస్తున్నారని, దీనిని తట్టుకోలేక తామే బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నామని తెలిపారు. సమావేశంలో అనంతగిరి ఎంపీపీ చుండూరు వెంకటేశ్వరరావు, లక్కారం, బొజ్జగూడెం సర్పంచ్‌లు భూపతి, వెంకటేశ్వర్లు, మాజీ సింగిల్ విండో చైర్మన్ బుర్రా నర్సింహారెడ్డి, కత్రం నాగేందర్‌రెడ్డి, గునుకుల స్వరూప పాల్గొన్నారు.













బీజేపీ అభ్యర్థుల బయోడేటా

భువనగిరి: గూడూరు నారాయణరెడ్డి

పుట్టినతేదీ: 26.02.1963, **తల్లిదండ్రులు:** గూడురు మంగారెడ్డి, భారతి
భార్య: పద్మావతిదేవి, **పిల్లలు:** ప్రియదర్శిని, శమంతిక, ప్రణయ్
విద్యార్హత: బీకాం, ఎల్ఎల్‌బీ
రాజకీయ ప్రస్థానం: 2005 నుంచి 2020 వరకు ఏబీవీపీ సభ్యుడిగా కొనసాగారు. 2020లో బీజేపీలో చేరారు.
సేవా కార్యక్రమాలు: 300 మంది పేద విద్యార్థులను దత్తత తీసుకొని చదివిస్తున్నారు. చేనేత కార్మికులకు ఆసు యంత్రాలు, రజకులకు ఇస్త్రీ పెట్టెలు, నాయీ బ్రాహ్మణులకు కిట్లతో పాటు 800 మంది పేద విద్యార్థులకు ఉచితంగా ఉద్యోగ శిక్షణ ఇప్పించారు.

నాగార్జునసాగర్: కంకణాల నివేదితరెడ్డి

పుట్టిన తేదీ: 12.05.1976, **తల్లిదండ్రులు:** నిర్మలాదేవి, జైహింద్‌రెడ్డి
స్వస్థలం: తిరుమలగిరి, పెద్దఅడిశర్లపల్లి మండలం
భర్త: కంకణాల శ్రీధర్‌రెడ్డి (బీజేపీ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు)
కుమార్తెలు: కావ్య, కీర్తి, **విద్యార్హత:** బీఎస్సీ (జనటిక్స్)
రాజకీయ నేపథ్యం: ఉన్నత విద్య పూర్తిచేసిన తర్వాత బాగ్ సంపర్క్ ప్రముఖ్, రాష్ట్రీయ సేవికా సమితి సభ్యురాలిగా, వీఎన్ఐటీ (విశ్వేశ్వరయ్య నేషనల్ ఇనిస్టిస్ట్యూట్ ఆఫ్ టెక్నాలజీ), నాగపూర్ బోర్డు ఆఫ్ గవర్నింగ్ సభ్యురాలిగా, ఏబీవీపీతో పాటు మహిళా సమన్వయ ఆర్గనైజేషన్‌లో పనిచేశారు.

తుంగతుర్తి : కడియం రామచంద్రయ్య

పుట్టిన తేదీ: 4.6.1960, **తల్లిదండ్రులు:** కడియం వెంకయ్య, సోమక్క
భార్య: సరస్వతి, **కుమారులు:** కళ్యాణ్ చందర్, జైచంద్ర
స్వస్థలం: నాగారం, **విద్యార్హత:** ఎంఎస్సీ, బీఈడీ
ఉద్యోగం: మైనింగ్ డిపార్ట్‌మెంట్‌లో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తూ 2018లో రిటైరయ్యారు.
రాజకీయ ప్రవేశం: 2018లో బీజేపీలో చేరి తుంగతుర్తి ఎమ్మెల్యేగా పోటీ చేశారు.
సేవా కార్యక్రమాలు: 2008లో తన తల్లి పేరిట కడియం సోమక్క మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ స్థాపించి సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు.

సూర్యాపేట: సంకినేని వెంకటేశ్వరరావు

పుట్టిన తేదీ: 10.06.1963, **తల్లిదండ్రులు:** సంకినేని రామారావు, కమలమ్మ
భార్య: లక్ష్మి, **కుమారులు:** అరుణ్, వరుణ్
విద్యార్హత: 10వ తరగతి, **వృత్తి:** కాంట్రాక్టర్
రాజకీయ ప్రస్థానం: 1988లో టీడీపీలో చేరి, 1999లో టీడీపీ నుంచి తుంగతుర్తి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ప్రస్తుతం బీజేపీ నుంచి పోటీ చేస్తున్నారు.

సూర్యక్షేత్రంలో ప్రత్యేక పూజలు


సూర్యక్షేత్రంలో పూజలు చేస్తున్న భక్తులు

అర్వపల్లి: తిమ్మాపురంలోని అఖండజ్యోతి స్వరూప సూర్య నారాయణస్వామి క్షేత్రంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారు జామున ఉషాపద్మిని ఛాయసమేత సూర్య నారాయణస్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు జరిపారు. ఆ తర్వాత యజ్ఞశాలలో మహాసౌరహోమాన్ని నిర్వహించారు. క్షేత్ర ఆవరణలోని కార్యసిద్ధి వీరహనుమాన్, శ్రీరామకోటి స్థూపాలను కూడా భక్తులు దర్శించుకున్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో క్షేత్ర వ్యవస్థాపకుడు కాకులారపు జనార్దన్‌రెడ్డి, కర్నాటి నాగేశ్వర్‌రావు, కక్కిరేణి చంద్రోఖర్, గుండా ప్రభాకర్, బీరవోలు ఇంద్రారెడ్డి, పులిచర్ల కృష్ణమూర్తి, నాగరాజు, అర్చకులు పాల్గొన్నారు.

యాదాద్రీశుడి గోపురంలా బతుకమ్మ


యాదాద్రీశుడి గోపురం మాదిరిగా తీర్చిదిద్దిన బతుకమ్మ

యాదగిరిగుట్ట: పట్టణంలో సద్దుల బతుకమ్మ పండుగను పురస్కరించుకొని యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయ గోపురం మాదిరిగా బతుకమ్మను తీర్చిదిద్దారు. దివంగత దొమ్మాట యాదగిరిరెడ్డి - భారతమ్మ దంపతులకు గుర్తుగా వారి కుటుంబ సభ్యులు దొమ్మాట లావణ్య, నాగమణి, స్వప్న, సౌజన్య ఆధ్వర్యంలో నాలుగు ఫీట్ల ఎత్తులో యాదాద్రి ఆలయ గోపురంలా తీరొక్క పూలతో తీర్చిదిద్దిన బతుకమ్మ ఆకట్టుకుంది. కాగా దొమ్మాట యాదగిరిరెడ్డి- భారతమ్మ దంపతులు 35 ఏళ్ల క్రితం దేవుళ్ల రూపంలో బతుకమ్మలను పేర్చడానికి శ్రీకారం చుట్టారు. ఆ సంప్రదాయాన్ని వారి కుటుంబ సభ్యులు కొనసాగిస్తున్నారు. వీరిని చూసి యాదగిరిగుట్ట పట్టణవాసులు కూడా దేవుళ్ల రూపంలో బతుకమ్మలను తీర్చిదిద్దుతున్నారు.





మట్టపల్లిలో నిత్య కల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో స్వామివారి నిత్య కల్యాణాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిత్యహోమం, మూలవిరాట్‌మూర్తికి, పంచామృతాభిషేకం, ఎదుర్కోళ్ల మహోత్సవం చేపట్టారు. అనంతరం కల్యాణతంతు చేపట్టారు. ముందుగా విశ్వక్సేనరాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాశన, మధుపర్కపూజ, మాంగళ్యధారణ గావించారు. అనంతరం నీరాజన మంత్రపుష్పాలతో మహానివేదన గావించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్ కుమార్, ఈఓ నవీన్ పాల్గొన్నారు.

బీజేపీ, బీఆర్ఎస్ తోడు దొంగలు

మిర్యాలగూడ: తోడు దొంగలుగా వ్యవహరిస్తున్న బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలను ఈ ఎన్నికల్లో ఓడించాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం దామరచర్ల మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో పార్టీ ముఖ్య నేతల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం దళితబంధు, బీసీబంధు పూర్తిస్థాయిలో అమలు చేయకుండా ఓట్ల పథకంగా మార్చిందన్నారు. బీజేపీ మతోన్మాద రాజకీయాలు చేస్తూ దేశ సంపదను బడా వ్యాపారులకు దోచి పెడుతుందన్నారు. సమావేశంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్, జిల్లా నాయకులు ధీరావత్ రవినాయక్, వీరేపల్లి వెంకటేశ్వర్లు, వినోద్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల వేళ విస్తృత తనిఖీలు

- 13.70లక్షల నగదు, 4.10 లక్షల విలువ చేసే వస్తువులు స్వాధీనం


మిర్యాలగూడ: మద్యం తరలిస్తున్న వ్యక్తులతో రైల్వే పోలీసులు

నల్లగొండ: శాసనసభ సాధారణ ఎన్నికల నేపథ్యంలో పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఆదివారం ఒక్క రోజే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆయా మండలాల్లో ఆధారాలు లేకుండా తరలిస్తున్న 13.70లక్షల నగదుతో పాటు రూ.4.10లక్షల విలువ చేసే మద్యం, ఇతరత్ర వస్తువులను జప్తు చేశారు. 29మందిపై ప్రొహిబిషన్ పాటు మరో 15మందిపై వివిధ రకాల కేసులు నమోదు చేశారు.

అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద రూ.4లక్షలు..

మఠంపల్లి: మండలంలోని మట్టపల్లిలో గల అంతరాష్ట్ర చెక్‌పోస్టు వద్ద ఆదివారం స్థానిక పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహించి రూ.4లక్షల నగదును జప్తు చేశారు. పల్నాడు జిల్లా మాచవరం మండలం బ్రాహ్మణపల్లికి చెందిన ఎం.వెంకటనారాయణ బైక్‌పై పిడుగురాళ్లనుంచి కోదాడకు వెళుతూ నగదుతో పట్టుబడ్డాడని ఎస్ఐ బాలకృష్ణ తెలిపారు. ఆ నగదుకు ఆధారాలు చూపకపోవడంతో జప్తు చేసి రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.

మిర్యాలగూడ రైల్వేస్టేషన్‌లో మద్యం పట్టివేత

మిర్యాలగూడ: పట్టణంలోని రైల్వేస్టేషన్‌లో అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని రైల్వే పోలీసులు పట్టుకున్నారు. గుంటూరుకు చెందిన ఎస్‌కె.జాని, నకిరేకల్‌కు చెందిన నెల్లూరు వంశీకృష్ణ, అదే గ్రామానికి చెందిన గోగుల అవినాష్‌లు మూడు బ్యాగుల్లో ఆంధ్రా ప్రాంతానికి మద్యాన్ని అక్రమంగా తరలిస్తున్నారు. రైల్వేస్టేషన్‌లో అనుమానస్పదంగా సంచరిస్తుండగా అదుపులోకి తీసుకుని విచారించగా వారి బ్యాగుల్లో ఉన్న 46 బీర్‌బాటిళ్లు, ఐదు మద్యం బాటిళ్లు స్వాధీనపరుచుకున్నట్లు రైల్వే ఎస్ఐ సాలకమ్మ తెలిపారు. వాటి విలువ సుమారు రూ.11,280 ఉంటుందని తెలిపారు. మిర్యాలగూడ నుంచి ఆంధ్రాకు అక్రమంగా తరిస్తున్నట్లు గుర్తించామని తెలిపారు. ఆ మద్యాన్ని ఎక్సైజ్ ఎస్ఐ రామకృష్ణకు అప్పజెప్పినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్ఐ ఎన్.హుస్సేన్, కానిస్టేబుల్ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మను పూల కవాతుగా జరుపుకోవాలి


మాట్లాడుతున్న విమలక్క

నడిగూడెం: బతుకమ్మను పూల, స్త్రీల కవాతుగా జరుపుకుందామని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర గౌరవ అధ్యక్షురాలు విమలక్క అన్నారు. అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య, వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం నడిగూడెం మండల పరిధిలోని చెన్నకేశవాపురంలో నిర్వహించిన బహుజన బతుకమ్మ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భ్రూణ హత్యలు, సామూహిక అత్యాచారాలు, రాజకీయ దాడులు దేశంలో రోజు రోజుకూ పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మణిపూర్ లాంటి సంఘటనలు మహిళలనే లక్ష్యంగా చేసుకుని జరిగాయన్నారు. బహుజన బతుకమ్మ ఉత్సవమే కాదు ఉద్యమం అని అన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు కూలీ పోరాట సమితి రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు బొమ్మకంటి కొమరయ్య, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్సూర్, పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి బెల్లి నాగరాజు, పలస యాదగిరి, అరుణ తదితరులు పాల్గొన్నారు.









యాదాద్రిలో తగ్గిన భక్తుల రద్దీ

యాదగిరిగుట్ట: బతుకమ్మ, దసరా పండుగల నేపథ్యంలో ప్రజలు తమ సొంతూళ్లకు వెళ్లడంతో యాదాద్రి క్షేత్రంలో ఆదివారం భక్తుల రద్దీ సాధారణంగానే ఉంది. దీంతో స్వామి వారి ధర్మదర్శనానికి సుమారు గంట, వీఐపీ దర్శనానికి 30 నిమిషాల సమయం పట్టిందని భక్తులు తెలిపారు. నిత్య కల్యాణంతో పాటు వివిధ పూజల్లో భక్తులు తక్కువగానే కనిపించారు. ఆయా పూజలతో స్వామి వారికి నిత్యాదాయం రూ.22,94,877 వచ్చినట్లు ఆలయాధికారులు వెల్లడించారు.

సాగర్‌లో పర్యాటకుల సందడి


లాంచీ దిగివస్తున్న పర్యాటకులు

నాగార్జునసాగర్: విద్యాసంస్థలకు దసరా సెలవులు ఇవ్వడంతో నాగార్జునసాగర్‌లో ఆదివారంపర్యాటకుల సందడి నెలకొంది. సాగర్‌కు విద్యార్థులతో పాటు పర్యాటకులు అధిక సంఖ్యలో వచ్చారు. లాంచీలలో నాగార్జునకొండకు వెళ్లి అక్కడ మ్యూజియాన్ని, బౌద్ధ శిల్పాలను సందర్శించారు. అనంతరం నదీ తీరంలో నిర్మితమైన బుద్ధవనాన్ని సందర్శించారు.









